క్లుప్తంగా

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి రూ.62 వేలు సాయం అందిస్తున్న ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లు

వెల్దుర్తి: వారంతా వెల్దుర్తి మండల కేంద్రంలో షాపులు, ఇళ్ల వద్ద సొంతంగా ఎన్నో ఏళ్లుగా ఫొటో, వీడియో గ్రాఫర్లుగా జీవనం సాగిస్తున్న వారు. తమలో ఒకరైన వెల్దుర్తిలో షాపు నిర్వహించుకుంటున్న ఫొటోగ్రాఫర్, కృష్ణగిరి మండలం పుట్లూరుకు చెందిన హనుమంతు గతేడాది సెప్టెంబరులో రోడ్డు ప్రమాదంలో అకాల మరణం పొందాడు. దీంతో చలించిపోయిన వెల్దుర్తి ఫొటో అండ్ వీడియోగ్రాఫర్లు హనుమంతు కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించుకున్నారు. చేయి చేయి కలిపి రూ.62 వేల నగదు సేకరించారు. శుక్రవారం పట్టణంలోని ఫొటో స్టూడియోలో హనుమంతు కుటుంబ సభ్యులకు ఆ మొత్తాన్ని అందించారు. ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



ఆదూరి శివుడును సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు

మద్దికెర: పుట్టిన ఊరిని మర్చిపోకుండా గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సర్పంచ్ బురుజుల విజయుడు, ప్రధానోపాధ్యాయులు ఫరూక్ అన్నారు. గ్రామానికి చెందిన ఆదూరి శివుడు పదేళ్లుగా ఎం.అగ్రహారం ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో రాణించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఆగస్టు 15న సాంతంత్ర్య దిన వేడుకల్లో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ.. ఆదూరి శివుడు ఇంగద హాలులో సంక్షేమ అధికారిగా విధులు నిర్వహిస్తూ స్వగ్రామంలో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేయడం అభినందనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రేవప్ప, శేఖర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పైర్లు వాడుముఖం



బాపనదొడ్డి సమీపంలో వర్షం లేక వాడుపట్టిన ఆముదం పంట

కృష్ణగిరి: ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు తగిన వర్షాలు లేక వాడుముఖం పడుతున్నాయి. పంటలు సాగుచేసినప్పటి నుంచి ఆరకొరగా కురిసిన వర్షాలకు ఆముదం పంట కంకి వస్తున్న సమయంలో వరుణుడు ముఖ చాటేయడంతో వాడుముఖం పట్టాయి. ఇలాగే మరో 8 రోజులు కొనసాగితే ఆముదం తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం నుంచి వాతావరణంలో మార్పులు వచ్చి ఆకాశం మేఘావృతం కావడంతో వర్షం రాకపోతుందా అనే ఆశతో అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

భారీ జాతీయ జెండాతో ర్యాలీ



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆలూరు: స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా ఆలూరులోని సాయిశ్రీ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం 60 మీటర్ల జాతీయ జెండాతో పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ స్కూల్లో ఆర్ఐఓ రంగారెడ్డి, ఏజీఎం సురేష్ మాట్లాడారు. విద్యార్థుల్లో దేశ భక్తి నింపేలా జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆ స్కూల్ సిబ్బందిని ఏంఈఓ కోమలాదేవి అభినందించారు. ప్రిన్సిపాల్ అర్చన, ఏఓ రామిరెడ్డి, అధ్యాపక బృందం తదితరులు ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

దేవనకొండ: ఇంటి పరిసరాలను ప్రజలు శుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రఘురాం రెడ్డి సూచించారు. ఈ మేరకు శుక్రవారం దేవనకొండలో డ్రైడే – ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. మురుగు కాలువలు, నిల్వ నీటిని వైద్య సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమకాటు ప్రమాదకరమని, దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా తదితర జబ్బులు వస్తాయన్నారు. ప్రజలు రాత్రివేళల్లో దోమ తెరలను వాడాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ కళ్యాణ్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి సాయిబాబా, హెల్త్ ఎడ్యుకేటర్ ఈశ్వరయ్య, సూపర్‌వైజర్ హనుమంతమ్మ, ఏఎన్ఎం వెంకటమ్మ, ఆశావర్కర్లు ఉన్నారు.

ప్రతిభకు 'ఉపకారం'

- ఎన్ఎంఎంఎస్‌తో పేద విద్యార్థులకు భరోసా
- సెప్టెంబర్ 15వరకు దరఖాస్తులకు గడువు
- డిసెంబర్ 3న రాత పరీక్ష
- ఎంపికైతే ఇంటర్ వరకు ఏడాదికి రూ.12వేలు స్కాలర్‌షిప్

తుగ్గలి : పేదరికం చదువుకు ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు భరోసా కల్పిస్తోంది. ఎనిమిదో తరగతిలో డ్రాపౌట్స్‌ను నివారించేందుకు ఏటా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)తో ప్రోత్సహిస్తోంది. ఎంపికైన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఏడాదికి రూ12వేల చొప్పున స్కాలర్‌షిప్ అందజేస్తోంది.

అర్హతలు ఇవే..

2023–24 విద్యా సంవత్సరంలో జిల్లా పరిషత్, మోడల్, ఎయిడెడ్, మునిసిపల్ తదితర ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50లక్షలు ఉండాలి. ప్రస్తుతం 8వతరగతి చదువుతూ ఏడో తరగతిలో జనరల్, బీసీ కులానికి చెందిన వారు 55 శాతం, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు సాధించిన వారు పరీక్ష రాసేందుకు అర్హులు. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

డిసెంబర్ 3న రాత పరీక్ష

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 3న రాత పరీక్ష నిర్వహించనున్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో పరీక్ష ఉంటుంది.

పరీక్ష విధానం

పరీక్ష రెండు విభాగాలుగా ఉంటుంది. ఒకటి మెంటల్ ఎబిలిటీ(ఎంఏటీ), రెండవది ఆప్టిట్యూట్ టెస్ట్(ఎస్ఏటీ). ఇందులో 6, 7, 8వతరగతి పాఠ్య పుస్తకాల్లోని సైన్స్, గణితం, సామాజిక అధ్యయనాల విభాగాల్లో 90 మార్కుల చొప్పున మొత్తం 180 మార్కులు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఇస్తారు.



తుగ్గలి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 8వతరగతి విద్యార్థులు

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎక్కువ మంది ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎంపికైన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.12వేలు చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ వస్తుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – రామవెంకటేశ్వర్లు, ఎంఈవో–2,తుగ్గలి

వేగంగా పక్కా ఇళ్ల నిర్మాణం

ఆలూరు: జగనన్న కాలనీలలో లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ ఆదినారాయణ ఆదేశించారు. ఆయన శుక్రవారం ఆలూరు, హాలహర్వి, దేవనకొండ మండలాల్లోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం స్థానిక డీఈ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రధానంగా 80 లేఅవుట్‌లలో 7,591 మందికి ఇళ్ల స్థలాలు మంజూరుచేయగా ఇప్పటివరకు దాదాపు 2,800 గృహాల నిర్మాణం పూర్తయినట్లు చెప్పారు. మరో 250 గృహాలు టాప్ లెవెల్ వరకు పూర్తి కావొచ్చాయన్నారు. ఇప్పటికే వివిధ కాలనీలలో నిర్మాణం పూర్తయిన గృహాలను మంత్రి గుమ్మనూరు జయరాం చేతులమీదుగా ప్రారంభించగా లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేశారని వివరించారు. ఈ నెలాఖరుకల్లా మరిన్ని ఇళ్ల నిర్మాణం పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. లబ్ధిదారులకు గృహ నిర్మాణ బిల్లులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నామని, స్టీల్, సిమెంట్, ఇసుక, ఇతర సామగ్రి అందుబాటుల్లో ఉంచామన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓటరు సర్వేను నిర్లక్ష్యం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ మోహన్‌దాస్

మద్దికెర: ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ వెరిఫికేషన్ సర్వేను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలో ఓటర్ సర్వేను ఆయన పరిశీలిచారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ బూత్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పత్తికొండ నియోజకవర్గంలో ఇప్పటివరకు 68 శాతం సర్వే పూర్తి చేసినట్లు చెప్పారు. మద్దికెర మండలం ఎం.అగ్రహారంలో వంద శాతం పూర్తి చేశారన్నారు. సర్వే సకాలంలో పూర్తి చేయని వారిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ నాగభూషణం, ఆర్ఐ రవికుమార్ ఉన్నారు.

జగనన్నతోనే సామాజిక న్యాయం



పోస్టర్లు విడుదల చేస్తున్న బడుగు బలహీన వర్గాల ఐక్యవేదిక నాయకులు

ఆలూరు రూరల్: సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యమని కర్నూలు జిల్లా బడుగు బలహీన వర్గాల ఐక్యవేదిక జిల్లా నాయకులు సుభాష్ చంద్రబోస్, ధనుంజయ, వైఎస్సార్ సీపీ నాయకులు లక్ష్మీకాంతయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఉమా కల్యాణ మండపంలో ఆ సంఘం ఆలూరు నాయకుడు రామాంజనేయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ నెల 23వ తేదీన ఎమ్మిగనూరులోని సోమప్ప మెమోరియల్ హాల్‌లో 'సామాజిక న్యాయం–జగన్నతోనే సాధ్యం' అనే అశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, మేధావులు, విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. తమ సామాజిక వర్గాలకు జరిగిన రాజకీయ, సామాజిక, సంక్షేమ అభివృద్ధిపై చర్చించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాలన్నీ ఏకమై వైఎస్సార్‌సీపీకి మరోసారి అఖండ విజయం అందించేందుకు కృషి చేయాలన్నారు. నాయకులు గోవిందప్ప, శివ, ఆంజినేయులు, గాదిలింగప్ప, నాగేంద్ర, వరుణ్ తదితరులు ఉన్నారు.

దేవనకొండ: బడుగు, బలహీనవర్గాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన ఎమ్మిగనూరు పట్టణంలో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ వేదిక సభ్యులు మద్దూరు సుభాష్‌చంద్రబోస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం దేవనకొండలో కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున, దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

ఆలూరు రూరల్: విద్యార్థులు, పోటీ పరీక్షలు సిద్ధమయ్యే యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ సూచించారు. ఆయన శుక్రవారం ఆలూరులోని గ్రంథాలయంను సందర్శించి రికార్డులు పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువత కోసం తగిన పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. ఆలూరు గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు సిబ్బంది ఉన్నారు.

చేసిన మేలును ధైర్యంగా చెబుతున్నాం





హెబ్బటంలో వృద్ధుడితో ఆప్యాయంగా మాట్లాడుతున్న కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, మంత్రి వెంట పాల్గొన్న నాయకులు

- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం
- హెబ్బటంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- గ్రామానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.23.40 కోట్లు లబ్ధి

హొళగుంద: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందించాడని, వాటిని లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి చెప్పే ధైర్యం తమకుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం సోదరుడు నారాయణ స్వామితో కలిసి హెబ్బటం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించి తమ పరిధిలో అందిస్తున్న పథకాలు, వారి బాధ్యతలు, పని తీరును తెలుసుకున్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించారు. హెబ్బటం గ్రామానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.23.40 కోట్లక్ లబ్ధి చేకూర్చినట్లు చెప్పారు. అర్హతే ప్రామాణికంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గ్రామస్తులు తమకు అవసరమైన వాటి గురించి అడుగుతుంటే టీడీపీ నేతలు, ఎల్లో మీడియా దాన్ని భూతద్దంలో చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడం వారి అవివేకమన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ప్రజలకు ఏమి చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఏ ఇంటికెళ్లినా చిన్న చిన్న సమస్యలు తప్పా ప్రభుత్వ పాలన, జగనన్న అందిస్తున్న పథకాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకే తమ ఓటు అని కుండబద్దలు కొట్టి మరీ తెలిపారు.

టీడీపీ నాయకులకు కూడా సంక్షేమ ఫలాలు

మంత్రి జయరాం మాట్లాడుతూ ప్రజలు గత టీడీపీ పాలన, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనను బేరీజు వేసుకోవాలని, మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. గత టీడీపీ పాలనలో ఆ పార్టీ కార్యకర్తలకే తప్పా ప్రజలకు పథకాలు అదేవి కాదన్నారు. ప్రస్తుతం ఆ పార్టీ నేతలకు కూడా పథకాలు అందిస్తున్నామని, అర్హత ఉంటే చాలు లబ్ధి చేకూరుతోందని వివరించారు.

డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు

గ్రామస్తులు డ్రైనేజీ, సీసీ రోడ్లు, విద్యుత్ లైన్‌మెన్ తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందిస్తూ సచివాలయాలకు మంజూరు చేసిన రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నేడు కోగిలతోటలో..

కోగిలతోట గ్రామంలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకుడు ఈశా తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పాల్గొంటారని వెల్లడించారు. హొళగుంద, ఆలూరు వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు శ్రీనివాసులు, షఫివుల్లా, వీరేశ్, మల్లికార్జున, మల్లికార్జున, ఉరుకుందప్ప, కోగిలతోట శేషప్ప, అయ్యాళప్ప, శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన



వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని మసీదుపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పథకాల ద్వారా పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు నింపారన్నారు. నేరుగా అర్హులైన లబ్ధిదారుల ఇళ్ల వద్దకే పథకాలు అందుతున్నాయని వివరించారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేశారని కొనియాడారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగనన్నను రాబోవు ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎంపీపీ గొల్ల కేశన్న, సర్పంచ్ నాగమ్మ, ఎంపీటీసీ జయలక్ష్మీ, వైస్ సర్పంచ్ చిన్న తిప్పన్న, నాయకులు రమేష్, రాముడు, అబ్బిలి హనుమంతు, కె.బీరప్ప, హనుమప్పనాయుడు, అంజనేయులు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల స్థాపనకు భూమిపూజ



పోనకలదిన్నెలో భూమిపూజ చేస్తున్న సర్పంచ్ పావని, ఎస్ఐ తిమ్మయ్య

నందవరం: మండల పరిధిలోని పోనకలదిన్నె గ్రామంలో సామాజిక పరివర్తకుడు మహాత్మ జోతిరావు పూలే, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల స్థాపనకు గ్రామ సర్పంచ్ సావని, ఎంపీటీసీ జైపాల్ రెడ్డి, ఎస్ఐ తిమ్మయ్య భూమి పూజ చేశారు. శుక్రవారం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో ఎంఆర్‌పీఎస్ సంఘాల రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ చైతన్య మాదిగ, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో భూమి పూజ జరిగింది. ముందుగా పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు గ్రామ సర్పంచ్, ఎస్ఐ, దళిత సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా పూలే, అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు గ్రామస్తులు ముందుకురావడం అభినందనీయమన్నారు. మహనీయుల స్ఫూర్తితో యువత ఆదర్శంగా మెలగాలన్నారు. గ్రామ నాయకులు నాగరాజు, రఘు, రామచంద్రరెడ్డి, గొల్ల వెంకటేష్, మేకల ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారి దురుసు ప్రవర్తన

తుగ్గలి: పెండేకల్లు రైల్వే జంక్షన్‌లోని స్టేట్ బ్యాంకులో అధికారి ఓ హెచ్ఎం పట్ల దురుసుగా ప్రవర్తించిన తీరు చర్చనీయాంశమైంది. పెండేకల్లు యూపీ పాఠశాలలో నాడు–నేడు పథకం కింద ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫ్యానల్ (ఐఎఫ్‌పీ) అమర్చేందుకు తరగతి గదుల్లో విద్యుత్తు సౌకర్యం కల్పించారు. వాటికి సంబంధించిన బిల్లులు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అకౌంట్‌కు అవసరమైన డాక్యుమెంట్స్‌తో హెచ్ఎం ప్రభాకర్ బ్యాంకుకు వెళ్లగా ఐడెంటీ కార్డు కావాలంటూ ముప్పుతిప్పలు పెట్టారు. తమకు ఐడెంటిటీ కార్డు ఇవ్వలేదని, ఆర్డర్ కాపీ, ఆధార్ కార్డు అన్నీ ఉన్నా ఎందుకు అకౌంట్ చేయరని ప్రశ్నించగా సర్వీస్ మేనేజర్ శరత్ రెడ్డి ఆగ్రహంతో ఊగిపోయారు. ఐడెంటిటీ కార్డు లేకపోతే అకౌంట్ చేసేదే లేదు.. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో గెట్‌అవుట్ అంటూ హెచ్ఎంపైకి దూసుకురాగా బ్యాంకు సిబ్బంది, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం నరేంద్ర అడ్డుకున్నారు. మేనేజర్ శ్రీనివాస్‌నాయక్ అక్కడే ఉన్నా కనీసం సర్దిచెప్పే ప్రయత్నం చేయలేదు. చివరకు ఎంఈవోతో ఒక లెటర్ తీసుకొస్తే అకౌంట్ చేస్తామని మేనేజర్ చెప్పడంతో వివాదం సద్దుమనిగింది. దురుసుగా ప్రవర్తించిన అధికారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు హెచ్ఎం చెప్పారు.

వర్షం కోసం పెద్దమ్మవ్వకు పూజలు

హొళగుంద: వర్షం కురువాలని కోరుతూ శుక్రవారం హొళగుందలో గ్రామస్తులు పెద్దమ్మవ్వ దేవర వేడుకలను జరుపుకున్నారు. గ్రామంలోని పెద్దబావి వద్ద గంగపూజతో పాటు ఇతర ప్రత్యేక పూజల అనంతరం కుంభాన్ని గ్రామ వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆలయంలో దేవికి ఆకుపూజ, మహామంగళారతి, నైవేద్య సంతర్పణ ఇతర ప్రత్యేక పూజలు చేశారు. పిండి వంటలు తయారు చేసి అవ్వకు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయంలో భక్తులకు, స్థానికులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో పాటు పాడి పశువులతో ప్రజలు సుఖంగా ఉండాలని మొక్కుకున్నారు.

వైఎస్సార్ చేయూతకు దరఖాస్తు చేసుకోండి

గోనెగండ్ల: వైఎస్సార్ చేయూత పథకానికి 45 సంవత్సరాలు నిండి 60 ఏళ్ల లోపు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చేయూత పథకం కింద 45 ఏళ్లు నిండిన మహిళలకు ప్రభుత్వం రూ.18,750 ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఈ పథకం కింద ఇప్పటికే లబ్ధి పొందుతున్న మహిళలు తగిన ధ్రువీకరణ పత్రాలను సమర్పించి సంబంధిత అధికారిచే అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కొత్తగా అర్హులైన మహిళలు వలంటీర్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ కోతలు

వెల్దుర్తి: విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ల నిర్వహణలో భాగంగా శనివారం వెల్దుర్తి, కలుగొట్ల, రామళ్లకోట సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాఘవేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. వెల్దుర్తి పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లెలో వార్డు మెంబర్ స్థానానికి ఎన్నికలు జరుగుతున్నందున ఆ గ్రామంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

పంట నమోదు పక్కాగా చేపట్టండి

కృష్ణగిరి: రైతులు సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ నమోదు చేసే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఏఓ వెంకటేశ్వర్లు సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామల్లో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా జాగ్రత్తగా పంట నమోదు చేపట్టాలని సూచించారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పంటల నమోదుకు గ్రామాలకు వచ్చే అధికారులకు రైతులు సహకరించాలని కోరారు.

వార్డు స్థానాలకు నేడు ఎన్నికలు



ఎల్.నగరం పోలింగ్ బూత్ వద్ద ఎస్ఐ, పోలీసుల బందోబస్తు

వెల్దుర్తి: బొమ్మిరెడ్డిపల్లె 3వ వార్డు, ఎల్ నగరం (పిక్కిలివానిపల్లె) 2వ వార్డు మెంబరు స్థానానికి శనివారం ఎన్నికలు జరుగనున్నాయి. బొమ్మిరెడ్డిపల్లెలో ఎంపీపీ స్కూల్‌లో, ఎల్.నగరంలో ఎంపీయూపీ స్కూల్ పోలింగ్ బూత్‌లలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని ఎన్నికల అధికారి/ఎంపీడీఓ శ్రీనివాసరావ్ తెలిపారు. 2 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. బొమ్మిరెడ్డిపల్లె వార్డు మెంబర్ స్థానంలో 139 ఓట్లు ఉండగా, ఎల్ నగరం పంచాయతీ స్థానంలో 244 ఓట్లు ఉన్నట్లు ఆయా కేంద్రాల ఆర్ఓలు అక్బర్‌బాషా, రమేశ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రితో ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. రెండు చోట్ల ఇద్దరు అభ్యర్థులు బరిలో ఉండగా ముఖాముఖి పోటీ నెలకొంది. శుక్రవారం ఆయా గ్రామాలను సందర్శించిన సీఐ యుగంధర్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ఎన్నికలు సజావుగా జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఎన్నికల వేళ 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కొత్త వ్యక్తులకు గ్రామంలో ప్రవేశం లేదని సూచించారు.

పకడ్బందీ ఏర్పాట్లు

వెల్దుర్తి: బొమ్మిరెడ్డిపల్లె, ఎల్.నగరంలో ఒక్కో వార్డు మెంబర్ స్థానానికి ఎన్నికలు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి/ఎంపీడీఓ శ్రీనివాసరావ్ తెలిపారు. శుక్రవారం ఆయా గ్రామాల పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఆయన సామగ్రితో చేరుకున్న పోలింగ్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఓటింగ్, కౌంటింగ్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆర్ఓలతో సమీక్షించారు.

ఓటరు సర్వే పరిశీలన

గోనెగండ్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల సమగ్ర సర్వేను బీఎల్ఓలు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ వేణుగోపాల్ ఆదేశించారు.ఆయన శుక్రవారం పిల్లిగుండ్ల గ్రామంలో బీఎల్ఓలు చేపట్టిన సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పిస్తామని, అలాగే జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్లు, చనిపోయిన వారి ఓటు హక్కు తొలగిస్తామని చెప్పారు. మరో రెండు రోజుల్లో గడువు ముగుస్తున్నందున సర్వే వేగవంతం చేయాలని బీఎల్ఓలకు సూచించారు.

పకడ్బందీగా సమగ్ర సర్వే




తుగ్గలిలో సర్వే రోవర్ పరికరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవి

తుగ్గలి: భూ వివాదాల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూ హక్కు–భూ రక్ష సమగ్ర సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ రవి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం తుగ్గలి వద్ద చేస్తున్న రీ సర్వేను ఆయన పరిశీలించారు. భూ రికార్డుల స్వచ్ఛీకరణ ప్రక్రియ పనులను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేస్తున్న సర్వేకు రైతులు సహకారం అందించాలని కోరారు. మండల సర్వేయర్ గాదిలింగప్ప, వీఆర్వోలు రెహమాన్‌బాషా,రామలింగప్ప పాల్గొన్నారు.

హాలహర్వి: సమగ్ర భూసర్వేను పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ మల్లికార్జున ఆదేశించారు. ఆయన శుక్రవారం మండలంలోని నిట్రవట్టి గ్రామంలో సర్వేను పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి సెంటు భూమిని సర్వే చేయాలన్నారు. డ్రోన్ సాయంతో పక్కా కొలతలతో భూముల సర్వే చేస్తున్నట్లు తెలిపారు. రీసర్వే డీటీ బ్రహ్మయ్య, సర్వేయర్లు వీరాంజనేయులు, వెంకటేశ్వర్లు, అరుణ్ జ్యోతి, వీఆర్వోలు ఆంజనేయులు, విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో విజ్ఞాన్ జ్యోతి–4 కార్యక్రమం



విద్యార్థులతో ప్రిన్సిపాల్ చందిరన్, కేవీకే శాస్త్రవేత్త లక్ష్మణ్ తదితరులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో విజ్ఞాన్ జ్యోతి– 4వ దశ ప్రారంభమైనందున అనుసంధాన కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చందిరన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బనవాసి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విజ్ఞాన్ జ్యోతి కార్యక్రమానికి ఎంపికైన వంద విద్యాలయాల్లో బనవాసి ఉండటం సంతోషంగా ఉందన్నారు. విజ్ఞాన్ జ్యోతి కార్యక్రమం ద్వారా 9, 10 తరగతుల వారికి సైన్స్, టెక్నాలజీలో అత్యుత్తమ విద్యాబోధన అందించనున్నట్లు చెప్పారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ బసవరాజ్, విజ్ఞాన్ జ్యోతి ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ పద్మజ, హరీష్ కుమార్, రింకుశర్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

25న ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు

ఎమ్మిగనూరుటౌన్: ఈనెల 25న ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలను కర్నూలులోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించనున్నట్లు ఆ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములుగౌడ్, సహాయ కార్యదర్శి విజయేంద్ర తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మహాసభల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరులో ప్రభుత్వ ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. ఏఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.